
# బీమా.. పాడి రైతులకు ధీమా

- పశువులకు ప్రమాద బీమా అందిస్తున్న జగన్ ప్రభుత్వం
- ప్రకృతి విపత్తులు, ప్రమాదాల్లో చనిపోతే పరిహారం
- నామమాత్రపు ప్రీమియం చెల్లింపుతో బీమా
- ఆర్‌బీకేలు, పశువైద్యశాలల్లో బీమా నమోదు ప్రారంభం




కోడూరు: గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఎక్కువగా పశుసంపద పైనే ఆధారపడి జీవిస్తారు. వ్యవసాయ పనులు, కూలి పనులు చేసుకుంటూ ఇంటి వద్ద పశువులు, మేకలు, గొర్రెలను పెంచుతూ వాటి ఉత్పత్తుల ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాలను బలోపేతం చేసుకుంటారు. రైతులకు వెన్నుదన్నుగా ఉంటున్న పశువులకు కూడా బీమా సౌకర్యం కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్ పశు బీమా పథకానికి శ్రీకారం చుట్టింది.

## రైతులు నష్టపోకుండా...

ప్రకృతి విపత్తులు, ఇతర ప్రమాదాల సమయంలో పశువులు మృతి చెందుతున్నాయి. పెంపకదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. పాడి రైతులు నష్టపోకుండా నామమాత్రపు ప్రీమియంతో పశువులకు ప్రభుత్వం బీమా కల్పిస్తోంది. గతంలో వైఎస్సార్ పశు నష్టపరిహారం పథకం ఉండగా.. దీనిలో పశువు విలువ ఎంత ఉన్నా గరిష్ఠంగా పాడి పశువుకి రూ.90 వేలు, గొర్రె, మేకలకు రూ.6 వేలు చొప్పున మాత్రమే పరిహారం అందించేవారు. ఇప్పుడు ఈ పథకం స్థానంలో వైఎస్సార్ పశు బీమా పథకాన్ని తీసుకువచ్చారు. పశువుల విలువను బట్టి బీమా చెల్లిస్తారు.

## బీమాలో ప్రభుత్వ వాటా..

బీమా పథకంలో పశువు విలువ ఎంత ఉంటుందో అంతకి బీమా చెల్లించే వెసులుబాటు ఉంటుంది. ఉదాహరణకు పాడి పశువు విలువ రూ.1.50 లక్షలు ఉంటే అంత మొత్తానికి బీమా చెల్లించుకోవచ్చు. బీమాకి చెల్లించే ప్రీమియం మొత్తంలో ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని మినహాయించి రైతులు మిగిలిన సొమ్ము చెల్లించాలి. ఈ పథకంలో నమోదు చేసుకున్న రైతులు పశువులు, గొర్రెలు, మేకలు చనిపోతే పదిహేను రోజుల్లోనే బీమా మొత్తం పొందే అవకాశం ఉంటుంది. ఎస్సీ, ఎస్టీల్లోని పశు పెంపకదారులు ప్రీమియంలో ఇరవై శాతం వాటా చెలించాలి. దారిద్ర్యరేఖకు ఎగువున ఉన్నవారు 50 శాతం వాటాను చెల్లిస్తే, మిలిగిన 50 శాతం వాటాను ప్రభుత్వం చెల్లిస్తుంది. ప్రతి కుటుంబానికి ఐదు పాడి పశువులు, 50 గొర్రెలు, మేకలు, పందులకు పశు బీమా ద్వారా పరిహారం పొందే అవకాశం ఉంది.

## చెల్లింపు ఇలా..

ఉదాహరణకు ఒక గేదె లేక ఆవు ధర రూ.30 వేలు ఉంటే, ఈ పథకంలో పశువుకు రూ.30 వేలు సంబంధించి బీమాను నమోదు చేస్తారు. పశువు ఖరీదైన రూ.30 వేలలో 6.4 శాతాన్ని ప్రీమియం రూపంలో చెల్లించాలి. ఈ 6.4 శాతంలో రైతుకు మళ్లీ ప్రభుత్వం సబ్సిడీని అందిస్తుంది. రూ.30 వేల ఖరీదైన పశువుకు రూ.1,920లు ప్రీమియం కాగా, దీనిలో ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులు రూ.384, ఇతర కేటగిరికి చెందిన లబ్ధిదారులు రూ.960 చొప్పున మాత్రమే ప్రీమియం రూపంలో చెల్లించాలి. ఆరు వేల విలువైన గొర్రె, మేక, పందులకు సంవత్సరానికి మూడు శాతం చొప్పున రూ.180లు, రెండేళ్లకు రూ.270, మూడేళ్లకు రూ.375 చొప్పున ప్రీమియం చెల్లించాలి. దీనిలో ఒకటి నుంచి మూడేళ్ల ప్రీమియం కింద ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారుడికి రూ.36, రూ.54లు, రూ.75లు చొప్పున, మిలిగిన లబ్ధిదారులు రూ.90, రూ.135, రూ.187.50 చొప్పున వాటా చెల్లించాల్సి ఉంటుంది.

## పశువులకు ట్యాగింగ్ తప్పనిసరి

అర్హత కలిగిన పాడి రైతులు, గొర్రెలు, మేకలు, పందుల పెంపకందారులు బీమాను సమీప రైతు భరోసా కేంద్రాలు, పశు వైద్యశాలల్లో చెల్లించవచ్చు. పథకం కింద నమోదు చేసే పశువుకు తప్పనిసరిగా ట్యాగింగ్ పూర్తి చేసి ఉండాలి. ట్యాగింగ్ పూర్తి చేసినట్లుగా పశువు చెవికి ట్యాగ్ కూడా ఉండాలి. ట్యాగ్ లేకపోతే బీమా సదుపాయం పొందే అవకాశం కోల్పోతారు. ఒకవేళ ట్యాగ్ పోతే మళ్లీ వేయించుకోవాలి. పథకంలో నమోదు చేసేందుకు రైతు లేదా పెంపకందారుడు తన ఆధార్, రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా కార్యాలయానికి తీసుకువెళ్లాలి. ఈ బీమా నమోదు ప్రక్రియను ఇప్పటికే పశువైద్యాధికారులు ప్రారంభించారు.

## 15 రోజుల్లోనే పరిహారం



వైఎస్సార్ పశు బీమా పథకంలో నమోదు చేస్తే పశువు చనిపోతే పదిహేను రోజుల్లోనే పరిహారం పొందవచ్చు. బీమాకు సంబంధించిన ప్రీమియం చెల్లింపులను ఇప్పటికే పశు వైద్యశాలలు, రైతు భరోసా కేంద్రాల్లో ప్రారంభించాం. పశువు విలువ ఎంత ఉంటే అంత విలువకూ బీమా సదుపాయం వర్తించే అవకాశం ఉంది. బీమా ప్రీమియం చెల్లింపులో ప్రభుత్వ సబ్సిడీ పోను మిగిలిన నగదును రైతు, పెంపకందారుడు చెల్లించాలి. పాలిచ్చే పశువును బట్టి దాని విలువను పశువైద్యాధికారులు నిర్ధారిస్తారు.

– మహ్మద్ షఫీ, పశువైద్యాధికారి, కోడూరు

---

# మేలు చేశాం.. ఆదరించండి

**ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు**



సంక్షేమ పథకాల లబ్ధిని చదివి వినిపిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

ఘంటసాల(అవనిగడ్డ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు మేలు జరిగిందని, మరోసారి ఆయనను ఆదరిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అమలులోకి వస్తాయని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఘంటసాల మండల పరిధిలోని పాపవినాశనం, గోగినేనిపాలెంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మందికి నివేశన స్థలాలు అందించి పక్కా గృహాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. సీఎం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల ఆదరణ మరింత పెరిగిందన్నారు. ఏమి చేయాలో దిక్కుతోచక ప్రతిపక్ష పార్టీలు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఎన్ని కుతంత్రాలు చేసినా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ఆదరించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చిన పలు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, సచివాలయ మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్రబాబు, సర్పంచ్‌లు కుంపటి సుశీల, రాచూరి ప్రసాద్‌బాబు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు వేమూరి రత్నశేఖర్, ఎడ్లపల్లి బసవయ్య, పరుచూరి రామకృష్ణ పాల్గొన్నారు.

---

## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిలకలపూడి(మచిలీపట్నం): విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీ డీసీఎల్ ఈఈ ఎం. భాస్కరరావు శుక్రవారం తెలిపారు. గొడుగుపేట, చెమ్మనగిరిపేట, విజయవాడ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

- గూడూరు: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గూడూరు, ముక్కొల్లు ప్రాంతాల్లో శనివారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ ఎం.రాజేష్ కుమార్ తెలిపారు. ముక్కొల్లులో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు, గూడూరులో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామని చెప్పారు.

### రిక్షా కార్మికుని భార్య నేత్ర దానం



మునిపల్లె శాంత కుమారి (ఫైల్)

నాగాయలంక: స్థానిక 11వ వార్డుకు చెందిన మునిపల్లె శాంతకుమారి (45)శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు విజయవాడ తాడిగడపలోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు. రిక్షా కార్మికుడైన ఆమె భర్త శ్రీను, కుమారుడు రఘు, కుమార్తె రాజేశ్వరి, ఇతర కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా నేత్ర దానానికి ముందుకు వచ్చారు. మండల నేత్ర దాన మోటివేటర్స్ తలశిల రఘుశేఖర్, కె.నారాయణ సహకారంతో ఆస్పత్రి కంటి వైద్య నిపుణుడు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ బృందం మృతురాలి కార్నియాలను సేకరించారు. మండలంలో నేత్రదానాల సంఖ్య 179కి చేరిందని రఘుశేఖర్ తెలిపారు.

### అన్నపూర్ణాదేవికి ఆషాఢ పూజలు



భావదేవరపల్లి(నాగాయలంక): భావదేవరపల్లిలోని అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం అమ్మవారికి ఆలయ అర్చకుడు శ్రీహరి అర్చకత్వంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అన్నపూర్ణాదేవి మూలవిరాట్‌కు వేప మండలతో విశేష అలంకారం చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు, సత్యవతి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

### రుద్రవరంలో ఈకేవైసీ నమోదు

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రతి రైతు ఈకేవైసీ నమోదు చేసుకుంటే 14వ విడత పీఎం కిసాన్ నిధులు విడుదలవుతాయని ఏఓ డి. హారిక తెలిపారు. రుద్రవరం గ్రామంలో రైతులకు ఈకేవైసీ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ మండల పరిధిలో 1,570 మంది ఈకేవైసీ నమోదు చేసుకోని వారు ఉన్నారని, ఈ నెలాఖరులోగా బయోమెట్రిక్ లేదా ఫేస్ అథెంటిఫికేషన్ ద్వారా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. వ్యవసాయాధికారులు రేణుక, బాలాజీ, వైఎస్సార్ సీపీ నాయకుడు ఫణికుమార్ పాల్గొన్నారు.

### పైడమ్మ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



పెడన: పట్టణంలోని పైడమ్మ తల్లి దేవస్థానం ఆలయ నూతన కమిటీ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసింది. ఈఓ ఈవీవీ మోహన్‌రావు కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. తోట సాంబశివరావు, శిరివెళ్ల వెంకట సూర్యనారాయణ, ఎస్‌జే భగవాన్, ఎస్. నాగమణి, కె. కోమలి, సీహెచ్ నాగమణి ప్రమాణం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బండారు మల్లి, ఆలయ ధర్మకర్తలు తోట నాగేశ్వరరావు, తోట రామారావు పాల్గొన్నారు.

### గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మొవ్వ: స్థానిక వేమూరి సుందర రామయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో పీజీ కోర్సుల్లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీ చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. మాధవి శుక్రవారం తెలిపారు. ఎంఎస్‌సీ కంప్యూటర్ సైన్స్‌కు 2 పోస్టులు, ఎంకామ్‌కు ఒక పోస్టును గెస్ట్ ఫ్యాకల్టీ ప్రాతిపదికన భర్తీ చేస్తామని వెల్లడించారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో ఫస్ట్ క్లాస్ కలిగి ఉండాలని, నెట్, సెట్, పీహెచ్‌డీ, ఎక్స్‌పీరియన్స్ ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. అర్హతగల వారు తమ రెజ్యూమ్‌లను gdcjkc.movva@ gmail.comకు పంపించాలన్నారు. ఈ నెల 27న ఇంటర్వ్యూ ప్రాతిపదికన పోస్టులు భర్తీ చేస్తామని వివరించారు.

---

# పేదలకు మేలు చేస్తుంటే అడ్డుకోవడం దుర్మార్గం

**వైఎస్సార్ సీపీ మండల నేతల ధ్వజం**

నాగాయలంక: పేదలకు మేలు చేసేలా జగనన్న కాలనీలకు మట్టి తోలుతుంటే టీడీపీ నేతలు అడ్డుకోవడమే కాకుండా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులపై ఆరోపణలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. వైఎస్సార్ సీపీ మండల కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు, ఏపీ స్టేట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది వెంకట నారాయణ(చిన్నారి), వక్కపట్లవారిపాలెం సర్పంచి అంబటి శ్యామ్ ప్రసాద్ శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. సీఆర్‌జెడ్ పరిధిలోని నాగాయలంక తీరంలో కృష్ణానదిలోని ఇసుక, బుసక గత పదేళ్ల నుంచి యథేచ్ఛగా కొల్లగొడుతున్న టీడీపీ నేతలను చుట్టూ పెట్టుకుని, పేదలకు అన్యాయం చేసేలా మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ ప్రతిరోజూ సీఆర్‌జెడ్ అంటూ నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని ధ్వజమెత్తారు. ప్రజలు దీనిని గమనిస్తున్నారన్నారు.

అవినీతి మచ్చలేని నాయకుడు, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుపై ఆరోపణలు చేయడం దుర్మార్గమన్నారు. టీడీపీ నేతలు దోచుకుంటే అది అభివృద్ధి, పేదలకు లబ్ధి చేకూర్చేందుకు జగనన్న కాలనీలకు మట్టి తోలితే మాఫియానా? అని ప్రశ్నించారు. జనం కోసం పోరాడితే హర్షిస్తారుగానీ వారికి అడ్డుపడితే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో పీఏసీఎస్ అధ్యక్షుడు తోట సాయిబాబు, రైతు నాయకుడు బీమా బాబూరావు, చిట్టా బాల పాపారావు, చిట్టా బాల మురళి తదితరులు పాల్గొన్నారు.

# నూరుశాతం రుణాల వసూలు



ధ్రువీకరణ పత్రాన్ని మేనేజర్‌కు అందజేస్తున్న అధ్యక్షుడు, సీఈఓ సిబ్బంది

నాగాయలంక: కేడీసీసీ బ్యాంకు నాగాయలంక బ్రాంచి పరిధిలోని ఎదురుమొండి పీఏసీఎస్‌లో 2022–23 సంవత్సరానికి నూరు శాతం రుణాలు వసూలు సాధించామని సంఘం అధ్యక్షుడు కన్నా రామ్మోహన్‌రావు శుక్రవారం తెలిపారు. సొసైటీలో 460 మంది రైతుల నుంచి స్వల్పకాలిక రుణాలు రూ.184.64 లక్షలు, దీర్ఘకాలిక, ఇతర రుణాలు రూ.65.53 లక్షలు, మొత్తం రూ.250.17 లక్షలు నూరుశాతం వసూలు జూన్ 23 నాటికి పూర్తి చేశారు. ఈ సందర్భంగా కేడీసీసీ నాగాయలంక బ్రాంచిలో జరిగిన కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ బుర్రె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రుణ వసూళ్లలో ఉత్తమ ఫలితాలు సాధించిన సీఈఓ కోసూరు ఆనంద బాబు, సిబ్బందిని అభినందించారు. నోడల్‌అధికారి జీఎస్ ప్రకాష్‌బాబు, సూపర్‌వైజర్ రెహమున్నీసా తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పాలకు ఎమ్మెల్యే వసంత నివాళి



రాంప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వసంత

పెడన: డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఉప్పాల రాంప్రసాద్‌కు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ శుక్రవారం నివాళులర్పించారు. కూడూరు పంచాయతీ శివారు కృష్ణాపురం గ్రామంలోని ఉప్పాల స్వగృహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుమారుడు ఉప్పాల రాము, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికను పరామర్శించి రాంప్రసాద్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం జెడ్పీటీసీ జి. శ్రీదేవి, మైలవరం, రెడ్డిగూడెం, జి. కొండూరు ఎంపీపీలు స్వామి, నాయుడు, తిరుపతమ్మ పాల్గొన్నారు.

# 'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయండి

పెడన: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ ఉద్యోగులు విజయవంతం చేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ ఎండీ ఖాజా అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో 1, 2 సచివాలయాల పరిధిలోని 1, 2, 3, 4 వార్డులకు సంబంధించిన వలంటీర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బళ్ల గంగయ్య, బళ్ల పద్మ, రాము, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**శిక్షణ తరగతులు..**

మండలంలోని నందమూరు కేడీసీసీ బ్యాంక్ కార్యాలయంలో జగనన్న సురక్ష శిక్షణ తరగతులు శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీఓ వి. రెడ్డయ్య మాట్లాడుతూ వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు రాజులపాటి అచ్యుతరావు, గరికపాటి వెంకట్రామానాయుడు, బెజవాడ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

- గూడూరు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. గూడూరులోని వెలుగు కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ వలంటీర్లు, గృహ సారథులు ప్రతి గృహాన్ని సందర్శించి అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, సర్పంచి లింగం సులోచనారాణి పాల్గొన్నారు.

**1 నుంచి నగరంలో 'జగనన్న సురక్ష'**

మచిలీపట్నంటౌన్: జగనన్న సురక్ష కార్యక్రమం నగరంలో జూలై 1వ తేదీ నుంచి నిర్వహిస్తామని కమిషనర్ జి. చంద్రయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి నాలుగు బృందాలు డివిజన్లలో పర్యటించి 11 రకాలైన సేవలపై ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తారని చెప్పారు. కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, జనన ధ్రువీకరణ, వివాహ ధ్రువీకరణ, కుటుంబ ధ్రువీకరణ, మరణ ధ్రువీకరణ, నూతన బియ్యం కార్డు, బియ్యం కార్డు విభజన, మ్యాపింగ్‌లో కుటుంబాల విభజన, ట్రాన్సాక్షన్ మ్యుటేషన్, ఆధార్‌కు ఫోన్ నెంబరు లింక్, క్రాప్ కల్టివేటర్, రైస్‌కార్డు తదితరాలు లబ్ధిదారులకు అందజేస్తారని వివరించారు. కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

---

### చౌడు భూముల్లో సాగుపై అవగాహన

చిలకలపూడి(మచిలీపట్నం): చౌడు భూముల్లో వరి వంగడాల సాగుపై రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు శుక్రవారం అవగాహన కల్పించారు. రుద్రవరం గ్రామంలో రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎం. గిరిజారాణి మాట్లాడుతూ ఈ భూముల్లో ఎంటీయూ 1061 కు ప్రత్యామ్నాయంగా ఎంసీఎం 100, బీపీటీ 5204కు ప్రత్యామ్నాయంగా ఎంసీఎం 113 రకం వాడాలన్నారు. అలాగే ఎంసీఎం 125 వరి రకంపై రైతులకు క్షేత్ర ప్రదర్శనలో వివరించారు. ఏఓ డి. హారిక, గ్రామ వ్యవసాయ సహాయకుడు బాలాజీ, అంగడాల ఫణికుమార్, రైతులు పాల్గొన్నారు.

### మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**చిలకలపూడి ఎస్‌ఐ బలరాం**

మచిలీపట్నంటౌన్: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చిలకలపూడి ఎస్‌ఐ కె. బలరాం అన్నారు. స్థానిక స్టార్ జూనియర్ కళాశాలలో శుక్రవారం మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ సరదా కోసం మాదక ద్రవ్యాలను తీసుకునే వారు వాటికి బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకుడు ఎండీ మస్తాన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రగ్స్ వినియోగం, రవాణా, తయారీ వంటి వాటిపై కఠినమైన చట్టాలను రూపొందించాయన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కుక్కల వీరవెంకటసత్యనారాయణ మాట్లాడుతూ మాదకద్రవ్యాల విక్రయాలకు పాల్పడే వారి వివరాలను తెలియజేసి వాటి నివారణకు సహకరించాలని కోరారు. సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి షేక్ మౌలాలి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాగిత శంకర సాంబశివరావు, మచిలీపట్నం శాఖ మహిళా అధ్యక్షురాలు నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

### వాహనాల తనిఖీ

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు ప్రధాన రహదారులపై పోలీసులు శుక్రవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. మహిళలకు దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ ఎ. పైడిబాబు పర్యవేక్షణలో ప్రధాన రహదారుల్లో డ్రైవ్‌లు నిర్వహించిన పోలీసులు ఆటోలు, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే మహిళలకు దిశ యాప్ ఉపయోగాలను వివరించి వారి ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేశారు. ద్విచక్ర వాహనాలు, కార్లు తదితర వాహనాల రికార్డులు పరిశీలించి పెండింగ్‌లో ఉన్న 22 చలానాల సొమ్ములు రూ.3.370 వసూలు చేశారు.

### నవోదయకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక



కె. ఆరాధ్య



ఎస్. తారసాత్విక్

నాగాయలంక: 2023–24 సంవత్సరానికి జరిగిన నవోదయ ప్రవేశ పరీక్షలో నాగాయలంక మండలానికి చెందిన ఇరువురు విద్యార్థులు ఆరో తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించారని ఎంఈఓ–2 అన్నపరెడ్డి రామారావు శుక్రవారం తెలిపారు. సంగమేశ్వరం ఎంపీపీఎస్‌లో అయిదో తరగతి చదివిన కొక్కిలిగడ్డ ఆరాధ్య 86 మార్కులతో నవోదయలో ఆరో తరగతి ప్రవేశానికి అర్హత సాధించింది. నాగాయలంక ఎంపీపీఎస్ విద్యార్థి శివకోటి తారసాత్విక్ నవోదయ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాడు. విద్యార్థులను పలువురు అభినందించారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక



మచిలీపట్నంటౌన్: సోషల్ వెల్ఫేర్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నికైంది. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని సోషల్ వెల్ఫేర్ కాలేజీ బాలుర వసతిగృహంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా టి. బాలస్వామి వ్యవహరించారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా గుంజా వెంకటేశ్వరరావు, అధ్యక్షుడిగా గోత్రు దాసు, ఉపాధ్యక్షుడిగా జిన్నాబత్తిన సుదర్శనరావు, కార్యదర్శిగా దేశాబత్తుల కుమార్, కోశాధికారిగా కొక్కిలిగడ్డ సతీష్ ఎన్నికయ్యారు. నూతన పాలకవర్గ సభ్యులకు ఉద్యోగులు పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు.

### 125 మందికి వైద్య సేవలు

బంటుమిల్లి: స్థానిక కాంతి కేంద్రం సేవా ట్రస్ట్ భవనంలో శుక్రవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. గుడివాడ గురురాజు ప్రభుత్వ హోమియో వైద్యశాల వైద్యులు రెడ్డి లక్ష్మీ 125 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. జూనియర్ వైద్యులు రాజేశ్వరి, మానస, గిరి, ల్యాబ్ టెక్నీషియన్ గోపి వైద్య సేవలు అందించారు. శిబిరం నిర్వాహకులు జె. వాసుదేవరావు, సభ్యులు అంజనేయులు, ఎ. రమణ, అమలేశ్వరరావు పాల్గొన్నారు.

---

# డిగ్రీ కోర్సులతో ఉద్యోగావకాశాలు

**కృష్ణా వర్సిటీ వీసీ రామ్మోహనరావు**



మాట్లాడుతున్న వీసీ రామ్మోహనరావు

మచిలీపట్నంటౌన్: డిగ్రీ కోర్సులతో ప్రపంచ వ్యాప్తంగా అపారమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్, కృష్ణా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె. రామ్మోహనరావు అన్నారు. శుక్రవారం నగరంలోని ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాల మీటింగ్ హాల్‌లో సింగిల్ మేజర్, మైనర్ డిగ్రీ కోర్సుల విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొత్త విధానంలో మేజర్ సబ్జెక్టులతో పాటు మిళిత సంఖ్యలో ఇతర మైనర్ సబ్జెక్టులను ఎంపిక చేసుకునే వెసులుబాటు డిగ్రీ విద్యార్థులకు ఉందన్నారు. మైనర్ సబ్జెక్టులుగా ఎంపిక చేసుకున్న పాఠ్యాంశాలను కళాశాలల్లోనే కాకుండా ఆన్‌లైన్ ద్వారా పూర్తి చేసుకునే వీలు ఉందని చెప్పారు. నేటి ఆధునిక ప్రపంచంలో సొంత ప్రాంతంలోనే ఉంటూ ఇతర దేశాల్లోని సంస్థల్లో పనిచేసే వెసులుబాటు కలిగిందని చెప్పారు. ఇంజినీరింగ్ కోర్సుల కన్నా డిగ్రీ కోర్సులు చేసిన వారికే సాఫ్ట్‌వేర్‌లో మంచి ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని వివరించారు. విద్యార్థులు సెల్‌ఫోన్లను విజ్ఞానానికి ఉపయోగించుకుని ఉన్నతులుగా ఎదగాలని సూచించారు. సెల్‌ఫోన్‌లో విద్యార్థులు ఏయే అంశాలకు స్పందిస్తున్నారో ఉద్యోగాలు ఇచ్చే సంస్థలు పరిశీలించి విద్యార్థుల నడవడికను అంచనా వేసి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లను మంచికి ఉపయోగించాలని సూచించారు. ఇంగ్లిష్ పరిజ్ఞానాన్ని మరింత పెంచుకోవాలని చెప్పారు. యూనివర్సిటీ సీడీసీ రామశేఖరరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. ఏంజెల్ జేవియర్, కళాశాల చైర్‌పర్సన్ ఎస్‌వైఎస్ ఆంజనేయులు, డైరెక్టర్ ఎస్. భాస్కర్, మామిడి వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు

# దోచుకున్నందుకే మిమ్మల్ని పక్కన పెట్టారు

కోడూరు: నీరు–చెట్టు, జన్మభూమి కమిటీలు, డెల్టా ఆధునికీకరణ పేరుతో అందిన కాడికి టీడీపీ నాయకులు దోచుకున్నారు కాబట్టే ప్రజలు ఆ పార్టీని పక్కన పెట్టారని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ గుర్రం బసవయ్య అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు తన వంతు సేవలందిస్తున్న కడవకొల్లు నరసింహారావుపై మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ విమర్శలు చేయడం తగదన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులు చేస్తుంటే ఓర్వలేని టీడీపీ నాయకులు రాజకీయ లబ్ధికోసం లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి సత్యనారాయణ, రైతు విభాగం జిల్లా కార్యదర్శి కొండవీటి వెంకటనారాయణ, మండల కన్వీనర్ పరిశె మాధవరావు, ఎంపీటీసీ బడే గంగాధరరావు పాల్గొన్నారు.

### మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం–చల్లపల్లి జాతీయ రహదారిపై గుండుపాలెం అడ్డరోడ్డు సమీపంలో రొయ్యల లారీ ఢీకొని ఘంటసాల మండలం లంకపల్లి ఎస్సీ కాలనీకి చెందిన కుంపటి జాయ్ సన్నీ మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ లంకపల్లి గ్రామస్తులు శుక్రవారం స్థానిక సర్వజన ఆస్పత్రి ప్రధాన గేటు వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. జాయ్ మృతదేహానికి సత్వరమే పోస్టుమార్టం నిర్వహించి నష్టపరిహారం అందించాలని, ప్రమాదానికి కారణమైన వాహనం నడిపిన డ్రైవర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిరసన తెలిపిన గ్రామస్తులకు ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కొల్లూరి బసవ మాదిగ మద్దతు తెలిపారు.

### పబ్లిక్ నోటీసు

నా క్లయింటు కృష్ణాజిల్లా, మచిలీపట్నం, చిలకలపూడి కాపురస్తులు మాగంటి దశరథ రామయ్య గారి కుమారుడు శ్రీనివాసరావు ఇచ్చిన సంజాయిషీ ప్రకారము యావన్మందికీ తెలియజేయునది ఏమనగా... దిగువ షెడ్యూలు ఆస్తిని మరకాని నాగవిజయ్‌బాబు వద్ద కొనుగోలు చేయదలచి విక్రయ ఖరారుకాబడినది. సదరు నాగ విజయ్‌బాబు గారు సింహాద్రి రాఘవయ్య గారు మరణించినందున వారి సంతానము వద్ద నుండి మరియు రాఘవయ్య గారి సంతతిలో రంగదాసు గారు మరణించినందున వారి వారసుల వద్ద నుండి కొనుగోలు చేసియున్నారు. వారి వారసులు వద్ద ద.నెం. 1825/2013రు నా క్రయం పొందియున్నారు. సింహాద్రి రాఘవయ్య గారు ది. 06-04-1964న ద.నెం. 865/1964రు ద్వారా కృష్ణాజిల్లా అఫీషియల్ రిసీవర్ వద్ద కొనుగోలు చేసియున్నారు. రాఘవయ్య గారికి ద.నెం. 1825/2013రులో ఉదహరించిన వ్యక్తులు కాకుండా యింకా ఎవ్వరైనా వారసులు గానీ, హక్కుదారులు గానీ ఉన్నయెడల తమ యొక్క అభ్యంతరములు దిగువ అడ్రసుకు వారం రోజులలోగా వ్రాతపూర్వకముగా తెలియజేయవలసినది. లేని యెడల సదరాస్తి నిష్పేచి ఆస్తిగా పరిగణించబడును.

**షెడ్యూలు ఆస్తి:** కృష్ణాజిల్లా, మచిలీపట్నం స.రి. వారి యిలాకా, మచిలీపట్నం టౌన్, సర్కిల్‌పేట, మున్సిపల్ పాత వార్డు నెం. 25రు, ప్రస్తుత వార్డు నెం. 28రు, బ్లాకు నెం. 28/572రు నకు సమీపమున గల 160.88 చ.గ.లు లేక 134.49 చ.మీ.ల స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు. **తూర్పు:** క్రయాస్తి ప్రహరీగోడను ఆనుకొని మున్సిపల్ రోడ్డు అ. 32-0 లు, **దక్షిణం:** క్రయాస్తి ప్రహరీగోడను ఆనుకొని విస్సకోట చంద్రమౌళేశ్వరరావు గారి ఇల్లు స్థలం అ. 42-6లు, **పడమర:** అ. 9 లు వెడల్పు గల జాయింటు దారిని ఆనుకొని అవనిగడ్డ సీతామహాలక్ష్మి గారి స్థలం అ. 32-0లు, **ఉత్తరం:** పుప్పాల శ్యామలగారి గారి స్థలము. అ. 48-0 లు.

కోట మెహర్ ప్రసాద్
అడ్వకేట్, నెం. 17-305ఎ,
ఈడేపల్లి, మచిలీపట్నం,
ఫోన్ నెం. 94407 72309

మచిలీపట్నం
ది. 23-06-2023